అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

కోడేరు : పోలీస్ స్టేషన్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు.

చారకొండ, జూలై 30 : ఆశ కార్యకర్తలు, జీపీ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆశ కార్యకర్తల సంఘం నాయకురాలు సత్యావతి, సుజాత, బాలిదమ్మ, సువర్ణ, రాణి, జీపీ కార్మికులు శేఖర్, నరేశ్, రాములు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సై రాజశేఖర్ వారిని సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

తిమ్మాజిపేట : పోలీస్‌స్టేషన్‌లో కార్మికులు

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్

తిమ్మాజిపేట, జూలై 30 : మండలకేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తిమ్మాజిపేటకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులను అదుపులోకి తీసుకొన్న తర్వాత సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

కోడేరులో..

కోడేరు, జూలై 30: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న మండలానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కోడేరు బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అచ్చంపేటటౌన్, జూలై 30 : అచ్చంపేట పట్టణంలోని ఎస్‌వీపీ గుప్తా వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ముక్తాల వెంకటేశ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు సంధ్యారాణి గణేశ్, క్లబ్ ప్రతినిధులు నర్సింహారావు, శ్రీనివాసులు, నరేశ్, రమేశ్, బాలాజీ ఉన్నారు.

అనాథ విద్యార్థులకు వస్తు సామగ్రి పంపిణీ

నాగర్‌కర్నూల్, జూలై 30 : లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు పుట్టిన రోజు సందర్భంగా నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతీ బాల కల్యాణ ఆశ్రమం, జ్ఞానేశ్వర వాత్సల్య మందిరంలోని అనాథ విద్యార్థులకు అన్నప్రసాద వస్తు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం, గోదుమ పిండి, బిస్కెట్స్, సబ్బులు, పేస్టులు, బ్రెస్‌లు, షాంపులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మల్టీ పుల్ హంగర్ చైర్మన్, మాజీ గవర్నర్ రాధాకృష్ణ, జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షురాలు రాధారెడ్డి, కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి నాగరాణి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ఇందుమతి, నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

శ్రీశైలం రిజర్వాయర్‌లోకి అనుమతి లేదు

శ్రీశైలం, జూలై 30 : శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరుగుతూ నిండు కుండలా మారుతున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ముందు జాగ్రత్తగా రిజర్వాయర్‌లోనికి ఎవ్వరూ వెళ్లొద్దని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు.

మంగళవారం ఉదయం టూరిజంశాఖ అధికారులకు, మత్స్యకారులకు నోటీసులు జారీ చేశారు. నీటి ప్రవాహం తగ్గే వరకు పడవలు నడపవద్దని ఆయన సూచించారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

వంగూరు, జూలై 30 : కరిగెట్టులో ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు బోల్తా పడి ఓ రైతు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం మేరకు వంగూరుకు చెందిన కొమ్ము లక్ష్మయ్య(70) తన వ్యవసాయ పొలంలో డ్రైవర్ లేకపోవడంతో లక్ష్మయ్య ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో అది బురదలో దిగింది. దీంతో ట్రాక్టర్‌ను పైకి లాగే సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్ నడుపుతున్న లక్ష్మయ్య దాని కింద పడి పోయాడు. చుట్టుపక్కల రైతులు వచ్చి తీసే లోపే రైతు మృతి చెందాడు.

పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టణంలో పాము హల్‌చల్

నాగర్‌కర్నూల్, జూలై 30 : నాగర్‌కర్నూల్ పట్టణంలోని 14వ వార్డులో హల్‌చల్ చేసింది. దీంతో కాలనీ వాసులు పరుగులు తీశారు. సంతబజార్‌లో హఠాత్తుగా పాము దర్శనమివ్వడంతో విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఖాజాఖాన్ పాములు పట్టే వారితో పట్టించారు.

దాదాపు గంటకుపైగా శ్రమించి పామును పట్టుకున్నారని తెలిస్తే కానీ కాలనీ వాసుల్లో భయం వీడలేదు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ మరియు చెక్‌బుక్స్ పోయినవి
తేది: 30-07-2024
దండు నారాయణరెడ్డి S/o రాంరెడ్డి, R/o మరికల్ గ్రామము మరియు మండలము, నారాయణపేట జిల్లా, వయస్సు: 63 సం॥లు అను నేను తమరితో చేయు విన్నపము ఏమనగా, నా యొక్క భార్య డి. లక్ష్మీ భర్త నారాయణరెడ్డి, ఆమె యొక్క ఫాం హౌస్ మరికల్ నుండి హైదరాబాద్‌కు బస్సులో వస్తున్నపుడు ఆమె బ్యాగ్ నందు నా యొక్క SBI సంతకం చేసిన చెక్ బుక్స్ మరియు 50 రూపాయల విలువైన స్టాంపు పేపర్స్, 100 రూపాయల స్టాంపు పేపర్స్, 3 వైట్ పేపర్లు మరియు 14,000/- రూ. అన్నీ బ్యాగ్‌లో పెట్టుకొని హైదరాబాద్‌కు మరికల్ నుండి వెళ్లేటప్పుడు బ్యాగ్ మిస్ అయిపోయింది. 06-07-2024 నాడు పోయినది. హైదరాబాద్ చేరిన తర్వాత చూసుకున్నాము. మిస్సింగ్ అయినది. 08-07-2024 రోజున హైద్రాబాద్ అత్తాపూర్ బ్యాంక్ నందు నా యొక్క బ్యాంక్ ఖాత క్లోజ్ చేయించినాను. కాబట్టి మీరు విచారణ జరిపి మాకు న్యాయం చేయగలరని తమరిని కోరనైనది.
సెల్ : 9440895292

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

• కలెక్టర్ బాదావత్ సంతోశ్

అచ్చంపేటరూరల్, జూలై 30 : పర్యావరణ పరి రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని నడింపల్లి వై చౌరస్తాలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అచ్చంపేట ఆర్డీవో మాధవి, ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్, ఏపీవో పర్వతాలు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

అట్టహాసంగా చెక్కులు పంపిణీ

నాగర్‌కర్నూల్, జూలై 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ-2024 మలివిడుత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేశారు. ఈ మేరకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన లబ్ధిదారులైన రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, సహకార సంఘాల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతులకు రెండో విడుత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాల్లో రూ.31వేల కోట్లు జమ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మొదటి విడుతగా ఈనెల 18వ తేదీన లక్షలోపు రుణాలను మాఫీ చేయగా, మలివిడుతగా ప్రస్తుతం లక్ష నుంచి 50వేలలోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడుతలో 46,780 మంది రైతు కుటుంబాలకు రూ.265 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, మలివిడుతలో 30,501మంది రైతులకు రూ.297కోట్ల నిధులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 77,281 మంది రైతులకు రూ.562 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. తొలి, మలివిడుతలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమకు రుణ విముక్తి కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావు, పీఏసీసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూపాల్‌రావు, రంగాపూర్ పీఏసీసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ గురుప్రసాద్, ఏపీజీవీబీ రీజియన్ మేనేజర్ రంజిత్ బ్యాంకు అధికారులు, మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతోనే మానసిక ఆరోగ్యం

• సైక్రియాటిస్ట్ జ్యోతి

విద్యార్థులకు సూచనలు చేస్తున్న సైక్రియాటిస్ట్ జ్యోతి

నాగర్‌కర్నూల్, జూలై 30 : మంచి ఆలోచనలు, ప్రణాళికా బద్ధంగా జీవన విధానాన్ని అలవర్చుకోవడం వల్ల స్ట్రెస్, డిప్రెషన్, యాంగ్జైటీని అధికమించవచ్చునని నాగర్‌కర్నూల ఏరియా ఆసుపత్రి సైక్రియాటిస్ట్ డాక్టర్ జ్యోతి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు దినసరి ప్రణాళిక, సమయపాలన, ఉల్లాసంగా, దినచర్య ప్రారంభించి ఏకాగ్రతతో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. దేహదార్డ్యాన్ని, పెంచేది వ్యాయామమైతే, మానసిక ఆరోగ్యం కోసం స్ట్రెస్ మేనేజ్‌మెంట్ నిర్వహణ కోసం విజ్ఞానంతో కూడిన అలవాట్లు, సమయానికి నిద్రించడం, ధూమపానం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ నిర్ణీత సమయానికి పౌష్టికాహార భోజనం వల్ల ఆరోగ్య సమస్యలను అధిగమించడం కోసం ప్రాణయామం లాంటి శ్వాసతో ధ్యాస చేయడం వల్ల డిప్రెషన్‌కు లోనవ్వకుండా చక్కటి జీవనశైలిని ఈ వయసునుంచే అలవర్చుకోవచ్చన్నారు. విద్యార్థులు ఏవైనా మానసిక సమస్యలు ఉన్నట్లయితే 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ మాధవి అధ్యక్షత వహించగా, జిల్లా వైద్యాధికారి కార్యాలయ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ మోహన్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులతో పలు ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భగవేని నర్సింహులు, లైబ్రేరియన్ రవీందర్‌రెడ్డి, రవిప్రకాశ్, సత్యం, వెంకట్‌రెడ్డి, హరిత, శిరీష, హిప్సా, తస్కిన్, కుర్షిత్‌బేగం, రాజయ్య, ప్రసన్నలక్ష్మి, పరమేశ్వరి, కిరణ్, చంద్రశేఖర్, రాణి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సన్మానం

విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అచ్చంపేట టౌన్, జూలై 30 : క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఉప్పునుంతల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అచ్చంపేట నియోజక వర్గానికి చెందిన మెరిట్ విద్యార్థులను మంగళవారం సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు పెద్ది మురళి, ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ హాజరై మాట్లాడారు. గత సంవత్సరం పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థి ఎండీ సమీరా(9.8), వెల్టూర్ విద్యార్థి జి.ప్రవళికను శాలువాతో సన్మానించామన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల మెరిట్ సాధించడానికి కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాస్‌రెడ్డి, వెల్టూర్ ప్రధానోపాధ్యాయుడు రవిశేఖర్‌లను క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీశ్, చంద్రశేఖర్, శ్యాంసుందర్, అజ్మతుల్లా, శ్రీధర్, శ్రీనివాసులు, లక్ష్మణ్, గోపి, శ్యామల గౌరి, మల్లారెడ్డి, జానకిరాం పాల్గొన్నారు.

రేలింగ్‌కూలి వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, జూలై 30 : రేలింగ్ కూలి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని అమ్మపల్లిలో మంగళవారం చోటుచేసుకున్నది. అమ్మపల్లి గ్రామానికి చెందిన బాలరాజు(52) వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వచ్చాడు. ఇంటిబయట శబ్దం రావడంతో బయటకు వచ్చాడు. అప్పుడే పైనుంచి రేలింగ్ కూలి పెళ్లలు పడడంతో కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల వారు శిథిలాలను తొలగించి చూడగా బాలరాజు అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణలో వివాహిత మృతి

అమ్రాబాద్, జూలై 30 : ఇల్లు అమ్మకం విషయంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వివాహిత మృతి చెందిన ఘటన పదర మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. పదర ఎస్సై రాజు కథనం మేరకు పదర మండల కేంద్రానికి చెందిన మృతురాలు ఎద్మ శ్రీదేవి, భర్త కృష్ణయ్య పదర గ్రామం లో వ్యవసాయం చేసుకుంటూ ఉండేవారు. మృతురాలి భర్త బంధువులైన జక్కుల తిరుపతయ్య, జక్కుల రాజు, జక్కుల బాలయ్య మరికొంత మంది కలిసి ఎద్మ శ్రీదేవిని నువ్వు గొడ్రాలివని మీకు పిల్లలు పుట్టలేదని అవమానించి, దీంతోపాటు మీ ఇల్లును ఎవ్వరికి అమ్మనివ్వమని, ఇల్లు మాకే కావాలని గొడవ పెట్టుకొని రాళ్లతో రక్తం వచ్చేలా గాయపరిచాగా సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ ఘర్షణలో ఆమె మరణానికి కారణమైన వారిపై మృతురాలి తమ్ముడు దాసరి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి, జూలై 30 : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన బిజినేపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకున్నది. బల్మూర్ మండలం జినుకుంట గ్రామానికి చెందిన రాజశేఖర్ తన బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా బిజినేపల్లి వద్ద గుర్తు తెలియని మరో బైక్ వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో కిందపడిన రాజశేఖర్‌కు తీవ్ర గాయాలు కాగా, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాదానికి కారణమైన బైకిస్టు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం

వెల్దండ, జూలై 30 : బుధవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్‌వో పాషా మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొత్త గేటు సమీపంలో ఉన్న తోడేటి చెన్నారెడ్డి గార్డెన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సభ్యులందరూ విధిగా హాజరుకావాలని పాషా పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి జూలై 30 : మండలంలోని తుర్కలపల్లికి చెందిన చిటికెల శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.5వేలు ఆర్థిక సాయాన్ని గ్రామంలో సిద్ధి వినాయక యూత్ సభ్యుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

పెంట్లవెల్లి, జూలై 30 : మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ వారంరోజుల నుంచి సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా మండల కేంద్రంతోపాటు, మాధవస్వామి, జటప్రోల్ గ్రామాల్లో ప్రభుత్వం స్థలం ఉందని ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. అంతేకాక మల్లేశ్వరం గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్‌ను ద్వారా రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హన్మంతు, ఎల్లగౌడ్, కుర్మయ్య, తిమ్మస్వామి, మద్దమ్మ, శంకరమ్మ ఉన్నారు.

తాసీల్దార్ ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలి

నివేదికలు పరిశీలిస్తున్న సీడీపీవో

తిమ్మాజిపేట, జూలై 30 : ఆగస్టు ఒకటి నుంచి తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీడీపీవో సంగీత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మంగళవారం మండలకేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నెలవారి నివేదికలను పరిశీలించి మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కను నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపూర్ పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్

వెల్దండ, జూలై 30 : మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వెల్దండ పోలీస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గుట్కాలు వాడకం, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మైనర్లు వాహనాలు తోలడం, 100 డయల్, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శివకుమార్, అమర్‌సింగ్, గోపి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు

వెల్దండ, జూలై 30 : మండలంలోని పోతెపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉడుత శ్రీశైలం రూ.11,116 వేలు, సిలోనిబండతండాకు చెందిన లచ్చిరాం రూ.10వేలు విరాళంగా మాజీ సర్పంచ్ వెంకటమ్మకు అందజేశారు. దీంతో వారిని ఆమె శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న కృష్ణారెడ్డి

వెల్దండ (కల్వకుర్తి రూరల్), జూలై 30 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోలనూ రాణించాలని కల్వకుర్తి మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రమణ, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మదన్‌మోహన్, నరేశ్ గౌడ్, తిరుపతి, నిజాముద్ధిన్, రవిగౌడ్, పీడీ యాదయ్య పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు

కల్వకుర్తి రూరల్, జూలై 30 : 18ఏండ్లలోపు వయస్సు పిల్లలతో పని చేయిస్తే యజమానులపై చట్టరీత్యా చర్యలు తప్పవని అపరేషన్ ముస్కాన్ కల్వకుర్తి ఎస్సై అంజయ్య అన్నారు. మంగళవారం కల్వకుర్తి లోని పలు రైస్ మిల్లు, హోటళ్లు, కిరాణం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసు నమోదు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింహ, హెడ్‌కానిస్టేబుల్ ఉన్నారు.

పాముకాటుకు గురైన మహిళా కూలీలు

• చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలింపు

కోడేరు, జూలై 30: వరి నాట్లు వేయడానికి తుకం తుంచుతుండగా పాముకాటుకు ఇద్దరు మహిళా కూలీలు గురైన ఘటన మండలకేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనంప్రకారం మండలకేంద్రానికి చెందిన పాడేండ్ల నాగయ్య పొలంలో వరినాట్లు వేయడానికి గ్రామానికి చెందిన 10 మంది మహిళా కూలీలు వెళ్లారు. ముందుకు వరి తుకం తుంచుతుండగా కూలీలు చింతకుంట లక్ష్మి, నల్లవెల్లి చిట్టెమ్మకు పాముకాటు వేసింది. పాము కాటు వేసిన విషయాన్ని వారు గమనించకుండా మిగతా కూలీలతో పాటు వరి తుకం తుంచుతున్నారు. 11:30గంటల సమయంలో కండ్లు తిరుగుతున్నాయని ఇద్దరు స్పృహ తప్పి కిందపడిపోయారు. గమనించిన నాగయ్య తనకుమారుడికి చెప్పగా వెంటనే వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్నారని వారికి ఎలాంటి అపాయం లేదని డాక్టర్లు చెప్పినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న చింతకుంట లక్ష్మి , చిట్టెమ్మ

లింగాల తాసీల్దార్‌గా తబితారాణి బాధ్యలు స్వీకరణ

లింగాల, జూలై 30 : లింగాల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తాసీల్దార్‌గా తబితారాణి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తాసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఉమ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా బదిలీపై వెళ్లగా అచ్చంపేట ఆర్డీవో కార్యాలయంలో డీఏవో విధులు నిర్వహించిన తబితారాణి లింగాలలో తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

వెల్దండ ఎంపీవోగా లక్ష్మణ్

వెల్దండ, జూలై 30 : మండల పంచాయతీ అధికారిగా ఆర్.లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. వంగూర్ మండల ఎంపీవోగా విధులు నిర్వర్తించిన లక్ష్మణ్ బదిలీపై వెల్దండకు రాగా ఇక్కడ ఎంపీవోగా పని చేస్తున్న సునీత బదిలీపై కల్వకుర్తి ఎంపీవోగా నియమకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎంపీవోగా ఎంపీడీవో కార్యాలయంలో లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు.

జిల్లా కన్వీనర్‌గా..

తాడూరు, జూలై 30 : తాడూరు మండలానికి చెందిన ఉదయ్‌కుమార్‌ను కోఠిలో ఉస్మానియా మెడికల్ కళాశాలలో జరిగిన శరీర అవయవదాతల రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా ఉదయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అఖిల భారత శరీర అవయవదాత వ్యవస్థాపక అధ్యక్షురాలు సీతామాలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి తనను ఎంపిక చేసినందుకు మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిత అభినందనలు తెలిపారు.

మూడు ఉద్యోగాలకు ఎంపికైన గిరిజన మహిళ

పార్వతి

కోడేరు, జూలై 30: పక్కా ప్రణాళిక, నిర్దిష్ట లక్ష్యంతో ముందుకుసాగితే ఒకటి, రెండు కాదు ఒకేసారి ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు సాధించవచ్చని నిరూపించింది గృహిణి. మండల కేంద్రానికి చెం దిన కానిస్టేబుల్ సతీమణి పార్వతి అనుకున్నది సాధించి పలువురి అభ్యర్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. జిల్లాలోని చారగొండ మండలం అగ్రహారం తండాకు చెందిన మంగ్లానాయక్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. డిండి ప్రాంతానికి చెందిన పార్వతిని ఆయన వివాహం చేసుకున్నాడు. పార్వతి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న కోరికతో ప్రణాళిక మేరకు చదివింది. దీంతో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జూనియర్ లెక్చరర్ లైబ్రేరియన్, గురుకుల పాఠశాల లైబ్రేరియన్, పోలీస్ సివిల్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల ఫలితాల్లో ఏకంగా మూడు పోస్టులకు ఎంపికైంది. కాగా పార్వతి 1 నుంచి 10 వతరగతి వరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో విద్యనభ్యసించగా బీటెక్ హైదరాబాద్‌లోనే పూర్తి చేసింది. భర్తతో పాటు ఇద్దరు సంతానం ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి ప్రభుత్వ కొలువులను సొంతం చేసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచింది.